ఆర్థిక సాయం అందజేత

కీసర: నాగారం మున్సిపల్ తులసినగర్‌కు చెందిన ఎండి.యూసుఫ్ గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి యూసుఫ్ కుటుంబసభ్యులను పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

దసరా పండుగను ఆనందంగా జరుపుకోవాలి

జవహర్‌నగర్: దసరా పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమని, కాంగ్రెస్ ప్రభుత్వం పండుగలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ బతుకమ్మ పండుగ గిన్నీస్ రికార్డు సాధించడం హర్షణీయమన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

గౌతంనగర్: ఓల్డ్ మిర్జాలగూడలో ఆంజనేయ సేవా భక్త బృందం ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం హోమం, మాకాపు అలంకార సేవ, హోమం, శయనాలంకారం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆంజనేయ సేవా భక్త బృందం, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జానపద నృత్యాలు



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో బుధవారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో పంజాబ్ రాష్ట్రానికి చెందిన జాన పద నృత్య భాంగ్రా, జమ్మూ రాష్ట్రానికి చెందిన జానపద డోంగ్రీ నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం చంద్ర శేఖర శిష్య బృందంచే నిర్వహిచిన కూచిపూడి నృత్య రూపకం అలరించింది.

నిరుపేదలకు చేయూతనిద్దాం

బోడుప్పల్: నిరుపేదలకు చేయూతనిద్దామని బోడుప్పల్ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీగౌడ్ పిలుపునిచ్చారు. మాజీ ఉపసర్పంచ్ కొత్త రవిగౌడ్, 2వ డివిజన్ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి శెట్టి హరికాంత్ గుప్తా సంయుక్తాధ్వర్యంలో 1,2,3 డివిజన్లలోని పేద ప్రజలకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉత్సవాలు



గౌతంనగర్: సాయినగర్‌లోని సాయిబాబా ఆలయంలో బుధవారం శ్రీసాయి సమాజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయిబాబా 107వ మహా సమాధి, దసరా ఉత్సవాలు నిర్వహించారు. అదేవిధంగా కేశవలహరి హౌజ్ ఆఫ్ మ్యూజిక్ వారిచే భక్తి సంగీత కార్యక్రమం చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

మల్కాజిగిరి: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ కొండలు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వరనగర్‌కు చెందిన నరేందర్‌కుమార్ తల్లి కమ్మరి పెంటాబాయి(67) ఈనెల 1 న యాదవనగర్‌లో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో వాహన పూజలు

కుషాయిగూడ: దేవీ శరన్నరాత్రులను పురస్కరించుకుని కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వాహన పూజలు నిర్వహించారు. కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి, ఎస్‌ఐలు వెంకన్న, శ్రీనివాస్, సాయిలు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో..

బోడుప్పల్: దసరా పండుగను పురస్కరించుకుని చెంగిచర్ల ఆర్టీసీ డిపోలో బుధవారం వాహన పూజ నిర్వహించారు. సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ సుచరిత, డిప్యూటీ రీజినల్ మేనేజర్ పవిత్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ కుటుంబ సభ్యులందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కవిత, అసిస్టెంట్ మేనేజర్లు సాయి, సుబ్రమణ్యం, ఆనందరావు, ఈడబ్ల్యూ మెంబర్ వెంకటేశ్, పద్మావతి, కేబీ నర్సింహ, సాయప్ప, చంద్రయ్య పాల్గొన్నారు.

సహకార సంఘాల్లో ప్రాయోజిత సేవలు

దీపావళి నుంచి ప్రారంభించేందుకు సహకార శాఖ సన్నాహాలు

- మీసేవ, పన్నులు ,బిల్లుల చెల్లింపు, జనరిక్ మందులు, ఆన్‌లైన్ ఆరోగ్య, బస్సు, రైల్వే, విమాన సేవలు
- కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ పూర్తి
- సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యేక దృష్టి
- నగర శివారు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో 48 సహకార సంఘాలు
- వీటి ద్వారా ప్రస్తుతం రైతులకు పరికరాలు, ఎరువులు, విత్తనాల విక్రయాలు మాత్రమే

సాక్షి,మేడ్చల్ జిల్లా: సహకార సంఘాల ద్వారా ప్రజలకు ప్రాయోజిత సేవలు అందించేందుకు చర్యలు చేపట్టిన సహకార శాఖ దీపావళి నుంచి వాటిని అందుబాటులోకి తెచ్చేందుకు సన్నాహాలు చేపట్టింది. ప్రజలకు పలు రకాల సేవలు అందించడమే లక్ష్యంగా డీసీసీబీ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లోని కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 48 సహకార సంఘాలు (పీఏసీఎస్/ ఎఫ్‌ఎస్‌సీఎస్) ఉండగా, 2.02 లక్షల మంది సభ్యులు ఉన్నారు. ఇందులో మేడ్చల్ జిల్లాలో తొమ్మిది సహకార సంఘాలు (పీఏసీఎస్/ ఎఫ్‌ఎస్‌సీఎస్) ఉండగా, 35,954 మంది సభ్యులు ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 311 సహకార సంఘాల్లో ప్రాయోజిత సేవలను అందుబాటులోకి తేనున్నారు. ఇందులో భాగంగా నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 48 సంఘాల ద్వారా ప్రాయోజిత సేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మేడ్చల్ జిల్లాలో ఘట్కేసర్, కీసర, శామీర్‌పేట , అల్వాల్, పూడూరు, మేడ్చల్, డబుల్‌పూర, బౌరంపేట, దూలపల్లి సహకార సంఘాల ద్వారా ప్రజలకు దీపావళి నుంచి ప్రాయోజిత సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు జిల్లా సహకార శాఖ అసరమైన చర్యలను తీసుకుంటోంది.



మెరుగైన టెక్నాలజీ..

సేవలు పెంచితే సహకార సంఘాలకు ప్రస్తుతమున్న సాంకేతిక పరిజ్ఞానం సరిపోయేలా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ప్రస్తుతం కోర్ బ్యాంకింగ్ ద్వారా రోజువారీ ఆన్‌లైన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మోడెం ద్వారా ఇవి జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని సంఘాల్లో కూడా ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకుచ్చేందుకు తగిన విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందిస్తున్నారు.

ముగిసిన శిక్షణ

ప్రాయోజిత సేవలపై సహకార సంఘాల్లో పని చేస్తున్న సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. 54 సర్వీసుల ద్వారా ప్రజలకు 340 బహుళ ఆర్థిక సేవలను అందుబాటులోకి తేనున్నారు. ప్రస్తుతం సహకార సంఘాల ద్వారా రైతులకు అవసరమైన పరికరాలు, ఎరువులు, విత్తనాలు మాత్రమే అందుతున్నాయి. రైతులతోపాటు ప్రజలకు మరింత చేరువయ్యేలా బహుళ ఆర్థిక సేవలను అందించేందుకు సహకార సంఘాలకు లాగిన్ ఇచ్చారు.

అందించే సేవలు ఇవీ..

ఆదాయ పన్ను, ఇంటి పన్ను, విద్యుత్ బిల్లుల చెల్లింపు, రిజిస్ట్రేషన్లు, నగదు తీసుకునే విధంగా మినీ ఏటీఎం, మీసేవ, ఇతర అన్ని రకాల లావాదేవీలు సహకార సంఘాల్లోనే జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, నిత్యావసర సరకులు, దుస్తులు, అవసరమైన ప్రతి వస్తువు కొనుగోలు చేసేందుకు సంఘంలోనే ఆన్‌లైన్ నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తారు. జనరిక్ మందులను అందుబాటులో ఉంచడం, ఆరోగ్యపరమైన సమస్యలను పరిష్కరించేందుకు కార్పొరేట్ వైద్యుల ద్వారా ఆన్‌లైన్‌లో సలహాలు, సూచనలు, రక్త నమూనాల సేకరణ, ఫలితాల విశ్లేషణలు అందేలా చూస్తారు. విమాన, రైల్వే, బస్సు రిజర్వేషన్ చేసుకునే వెసులుబాటు కలిపిస్తున్నారు. లావాదేవీలు నిర్వహించేందుకు సహకార సంఘం నుంచి కరెంట్ ఖాతాలను తెరిచారు.

దశల వారీగా అమలుకు చర్యలు

సహకార సంఘాల్లో దీపావళి నుంచి అన్ని రకాల ఆన్‌లైన్ సేవలను ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. మేడ్చల్ జిల్లాలో తొమ్మిది సహకార సంఘాల ద్వారా ప్రజలకు ప్రాయోజిత సేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నాం. ఇటీవల సిబ్బందికి ఇచ్చిన శిక్షణలో ప్రజలకు అందించాల్సిన సేవలపై అవగాహన కల్పించాం. శిక్షణతో పాటు సందేహాలు నివృత్తి చేశాం. సేవలు అందుబాటులోకి వస్తే వ్యాపారాలు పెరిగి సంఘాలు బలోపేతం అవుతాయి. ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

– వెంకట్‌రెడ్డి, జిల్లా సహకారశాఖాధికారి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

విజయానికి ప్రతీక విజయదశమి

- జిల్లా ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు
- మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి



సాక్షి,మేడ్చల్ జిల్లా: దసరా (విజయ దశమి) పండగ విజయానికి ప్రతీకగా నిలుస్తుందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. దసరా అంటే.. చెడును జయించి మంచిని సాధించడమేనన్నారు. విజయాన్ని చాటి చెప్పడం వంటి సంస్కృతులకు దసరా ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మహిషాసురునిపై దుర్గా మాత సాధించిన విజయానికి గుర్తుగా అమ్మవారిని కొలుస్తూ .. దేవీ శరన్నవరాత్రుల్లో వివిధ అలంకరణలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. ప్రజలందరికీ అమ్మవారి కరుణ కటాక్షాలు కలగాలని, అమ్మవారి చల్లని చూపులు అందరిపై ఉండాలని జిల్లా ప్రజలందరికీ అన్నింటా విజయం సిద్ధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. దసరా పండగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరుతూ ... జిల్లా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

కాళికా దేవీ నమోస్తుతే..

మేడ్చల్ డివిజన్ పరిధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. 9వ ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారిని గడిమైసమ్మ ఆలయంలో కాళికా దేవిగా అలంకరించారు. కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు శ్రీ మహిషాసురమర్ధిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. – మేడ్చల్ జోన్ బృందం



మహిషాసురమర్ధినిగా కీసరగుట్ట అమ్మవారు



కాళికా దేవి రూపంలో గడిమైసమ్మ



అమ్మవారికి కుంకుమార్చన చేస్తున్న భక్తులు

వృద్ధులకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి



కేక్ కట్ చేస్తున్న సీనియర్ సిటిజన్స్

పోచారం: వయోవృద్ధులకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు అన్నారు. ఈ మేరకు బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని సుప్రభాత్ టౌన్‌షిప్‌లో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బంగారి రాజయ్య మాట్లాడుతూ.. వయోవృద్ధులకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యదర్శి అళవందార్ వేణు మాధవ్ మాట్లాడుతూ.. సమాజంలో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. అనంతరం వయోవృద్ధులైన కొమరయ్య, సత్యనారాయణలను ఘనంగా సత్కరించి, కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మల్లయ్య, రాజనర్సు, సర్జిత్ సింగ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రావణ దహనం ఏర్పాట్ల పరిశీలన

ఉప్పల్: జీహెచ్‌ఎంసీ ఉప్పల్ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించే రావణ దహన ఏర్పాట్లను మందుముల పరమేశ్వర్ రెడ్డి బుధవారం పరిశీలించారు. కార్యక్రమానికి పుర ప్రముఖులు, కార్పొరేటర్లు, స్థానికులు, అధికారులు, పెద్ద ఎత్తున పాల్గొననున్నట్లు తెలిపారు. లింగంపల్లి రామకృష్ణ, ఈగ ఆంజనేయులు, సల్లా ప్రభాకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

బోడుప్పల్: దసరాను పురస్కరించుకుని మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించే రావణ దహనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. సాయంత్రం 6.30 గంటలకు బంగారు మైసమ్మ ఆలయం వద్ద జరిగే ఈ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మల్లాపూర్: మల్లాపూర్ శాంతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఓల్డ్ మల్లాపూర్‌లో గురువారం రాత్రి 8 గంటలకు రావణ దహనం నిర్వహించనున్నట్లు శాంతి యూత్ క్లబ్ ప్రతినిధులు బుధవారం తెలిపారు. అలాగే అమ్మవారి మండపం వద్ద ఉదయం చండీ హోమం, వాహనాల పూజకు ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.



ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

సామూహిక అక్షరాభ్యాసం

మల్కాజిగిరి: త్రిశక్తి సేవా సమితి ఆధ్వర్యంలో శంకర విద్యాపీఠం (కనకరాజుతోట)లో అర్చకుడు జోగారావు ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు సూర్యకుమారి మాట్లాడుతూ.. సంస్కృతి, సాంప్రదాయాలను గుర్తు చేసే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. శేషుకుమార్, సమయ, రవికుమార్, జ్యోతి, రామసాయిబాబు పాల్గొన్నారు.

వాలీబాల్ చాంపియన్ నాచారం డీపీఎస్

మల్లాపూర్: బ్లాక్ హక్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్సిటీ హైదరాబాద్ వాలీబాల్ టోర్నమెంట్‌లో నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్ కేవీబీఆర్ ఇండోర్ స్టేడియంలో జరగగా డీపీఎస్ గాడియం ఇంటర్నేషనల్ స్కూల్ 3–1 సెట్ల తేడాతో విజయం సాధించినట్లు డీపీఎస్ పీఆర్‌వో రఘువ తెలిపారు. ట్రోఫీని కైవసం చేసుకోవడంతో పాఠశాల యాజమన్యం వాలీబాల్ టీంను అభినందించింది.

‘ప్రేమకు పరాకాష్ట నాటిక’ ప్రదర్శన

మల్లాపూర్: రవి అండ్ రవి ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్త కన్నీరు నాగభూషణం, బళ్లారి రాఘవ బిరుదు గ్రహీత మాడుగుల కృష్ణమోహన్ రచించిన ‘ప్రేమకు పరాకష్ట 356 నాటిక’ను బుధవారం మల్లాపూర్‌లో ప్రదర్శించారు. మాడుగుల కృష్ణమోహన్, ఐరేని రమేశ్‌గౌడ్, జంగయ్య గౌడ్, నటిమణి మను ప్రియ, తదితరులు పాల్గొన్నారు.

మెడిసిటీలో లేబర్ అనల్జీషియా సేవలు



లేబర్ అనల్జీషియా సేవలను ప్రారంభిస్తున్న శివరామకృష్ణ, వైద్యులు

మేడ్చల్‌రూరల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధి ఘనాపూర్‌లోని మెడిసిటీ ఆస్పత్రిలో మహిళ ప్రసవ సమయంలో నొప్పి నివారణకై లేబర్ అనల్జీషియా సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. మెడిసిటీ మెడికల్ సైన్సెస్ ప్రెసిడెంట్ శివరామకృష్ణ, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ కల్పన బుధవారం ఈ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళకు ప్రసవ సమయంలో అత్యంత నొప్పిని తగ్గించి, మహిళ తల్లిగా మారే మధుర క్షణాలను ఆనందమయంగా మార్చడానికి వీలు కల్పించేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రత్యేక సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. మహిళలకు సుఖవంతమైన ప్రసవ అనుభవాన్ని మిగిల్చే దిశగా మెడిసిటీ ఆస్పత్రి పనిచేస్తుందన్నారు. అనంతరం ఆస్పత్రి, మెడికల్ కళాశాలలో దసరా పండగను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహేంద్రసింగ్ నేగి, డైరెక్టర్ గీత, వైద్య అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లిక్కర్ డీసీఎంలో మంటలు

రామంతాపూర్: ఐఎంఎఫ్‌ఎల్ డిపో నుంచి మద్యం లోడ్‌తో వెళ్తున్న ఓ డీసీఎం వాహనానికి విద్యుత్ వైర్లు తగిలి అగ్ని ప్రమాదం జరిగిన ఘటన హబ్సిగూడ వీధి నంబర్–8లో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. హబ్సిగూడ వీధి నంబర్–8 నుంచి రామంతాపూర్‌లోని ఓ మద్యం షాప్‌కు మద్యం కార్టన్లు తీసుకెళ్తున్న డీసీఎం వాహనం పై కప్పునకు స్థానిక ఇండియన్ బ్యాంక్ ఎదురుగా కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగలడంతో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో మద్యం కాటన్లు పాక్షికంగా దగ్ధమయ్యాయి. అప్రమత్తమైన డ్రైవర్ స్థానికులతో కలిసి మద్యాన్ని కిందికి దించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. కొంతమంది అందిన కాడికి మద్యం బాటిల్స్‌ను ఎత్తుకెళ్లారని సమాచారం. ఉప్పల్ ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



డీసీఎం వ్యాన్‌లో చెలరేగిన మంటలు



ఘనంగా సద్దుల బతుకమ్మ

మేడ్చల్,ఎల్లంపేట్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలలోని పలు గ్రామాల్లో బతుకమ్మ పండగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు గునుగు, తంగేడు, కట్ల, చామంతి, బంతి లాంటి వివిధ రకాల పూలతో బతుకమ్మను తయారు చేసి అందులో గౌరమ్మను పెట్టి పూజలు చేశారు. బతుకమ్మ పాటలు పాడుతూ పండుగను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం చెరువుల్లో నిమజ్జనం చేశారు – మేడ్చల్





అత్వెల్లిలో బతుకమ్మ సంబరాలు..

ఆగుతూ..సాగుతూ..

నత్త నడకన మార్కెట్ల నిర్మాణం!

- నిధుల సమస్యతో పనుల్లో తీవ్ర జాప్యం
- సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులకు రూ.39.90 కోట్లు
- సకాలంలో నిధులు విడుదల కాక.. పెరిగిన నిర్మాణ వ్యయం
- బస్తీ, పట్టణ వాసుల అవస్థలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: నగర శివారు ప్రజలకు కనీస మౌలిక వసతుల కల్పనలో భాగంగా పురపాలక సంఘాల్లో ప్రారంభించిన సమీకృత (వెజ్, నాన్–వెజ్) మార్కెట్ల నిర్మాణ పనులు నత్తకు నడక నేర్పుతున్నాయి. నిధుల లేమితో సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు నెమ్మదించటంతో పట్టణ వాసులకు ఇబ్బందులు తప్పటం లేదు. ప్రభుత్వం సమీకృత మార్కెట్ల నిర్మాణాలకు సరిపడా నిధులను సకాలంలో విడుదల చేస్తే తప్ప... పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది.

ఏళ్లు గడుస్తున్నా..

సమీకృత మార్కెట్ల నిర్మాణానికి నాలుగున్నర ఏళ్ల క్రితం అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనులు మొదలు పెట్టినా.. అవసరమైన నిధులు సకాలంలో విడుదల కాకపోవటంతో పనులు పూర్తిగా మందగించాయి. ఈ నేపథ్యంలో 2022లోనే ప్రజలకు అందుబాటులో రావాల్సిన సమీకృత మార్కెట్లు నిధుల లేమితో అందని ద్రాక్షగా మారింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని జవహర్ నగర్, బోడుప్పల్, కొంపల్లి, ఘట్కేసర్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, మేడ్చల్, నాగారం, పోచారం, నిజాంపేట్, దుండిగల్, పీర్జాదిగూడ, దమ్మాయిగూడ పురపాలక సంఘాల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు పట్టణ ప్రజలకు తీవ్ర అందోళనకు గురిచేస్తోంది. ఈ మార్కెట్ల నిర్మాణాలు సకాలంలో పూర్తయితేనే.. నగర శివారు పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు కూరగాయలు, మాంసం, పండ్లు, ఇతర తినుబండారాలు ఒకే చోట లభించే అవకాశముంటుంది.

స్థలం ఆధారంగా నిధుల కేటాయింపు..

పురపాలక సంఘాల్లో ఒక ఎకరం నుంచి రెండు ఎకరాల స్థలంలోపు నిర్మించతలపెట్టిన సమీకృత మార్కెట్లకు రూ.2 కోట్లు, రెండు ఎకరాలు ఆపైన ఉన్న స్థలంలో నిర్మించ తలపెట్టిన సమీకృత మార్కెట్లకు రూ.4.50 కోట్లు కేటాయిస్తూ.. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయా పట్టణాల్లోని సమీకృత మార్కెట్ల భవన నిర్మాణ సముదాయాల్లో భాగంగా షెడ్లు, పార్కింగ్ వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన నిర్మాణ పనులను మున్సిపల్ యంత్రాంగం చేపడుతోంది.

13 పురపాలక సంఘాల్లో ..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాల్లో సమీకృత మార్కెట్ల కోసం అర ఎకరం నుంచి రెండు ఎకరాల చొప్పున 16.82 ఎకరాల స్థలాన్ని అధికార యంత్రాంగం కేటాయించింది. భవనాలు, పార్కింగ్, ఇతర వసతుల పనుల నిమిత్తం ప్రభుత్వం రూ.39.90కోట్ల నిధులు మంజూరు చేసింది. జవహర్ నగర్, నిజాంపేట్, బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్లలో సమీకృత మార్కెట్ల భవన సముదాయాలు, పార్కింగ్ నిర్మాణం కోసం రూ.4.5 కోట్లు చొప్పున నిధులు మంజూరు చేయగా, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, కొంపల్లి, దుండిగల్, తూముకుంట, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్కేసర్ మున్సిపాలిటీల్లో మార్కెట్ల నిర్మాణానికి రూ.2 కోట్ల చొప్పున నిధులను కేటాయిస్తూ.. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా ..సకాలంలో నిధులు విడుదల కాక పనులు ముందుకు సాగడం లేదు. ఈ మార్కెట్ల నిర్మాణ పనులు సకాలంలో పూర్తయ్యేలా సర్కారు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.